అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు

ఓడిపోయినోళ్లను అసెంబ్లీలోకి రానిస్తరా?

- మరి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా అనుమతిస్తారు?
- ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలి
- ప్రొటోకాల్ లేదు..పైగా కేసులు
- స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని, శాసనసభ్యుల హక్కులను పరిరక్షించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఏ హోదాలో ఆహ్వానిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు, సునీతాలక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. తమ నియోజకవర్గాల్లో అధికారులు యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, కల్యాణలక్ష్మి, బోనాల చెక్కులను ఎలాంటి హోదా లేనివాళ్లతో పంపిణీ చేస్తున్నారని, తమకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వెల్లడించారు. ఇలా అయితే ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులను అసెంబ్లీ సమావేశాలకు అనుమతించాలని స్పీకర్‌కు సూచించారు. లేకుంటే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ పాటించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పద్మారావు, సునీతాలక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మాణిక్‌రావు తదితరులు విడివిడిగా స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అడిగితే ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డిపై కేసులు పెట్టారని తెలిపారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద మాజీ మంత్రి పద్మారావు మాట్లాడుతూ.. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులకు అధికారిక ఆహ్వానాలు,ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఇలాగే ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగితే కోర్టులను ఆశ్రయిస్తామని ప్రకటించారు. సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఓడిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులకే ప్రభుత్వ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. గెలిచిన ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలని తాము స్పీకర్‌ను కోరామని వెల్లడించారు. సర్దుకుపోవాలని ఎమ్మెల్యేకే దేవాదాయ అధికారులు, పోలీసులు చెప్పే పరిస్థితి తన నియోజకవర్గంలో వచ్చిందని.. ఇదేనా ప్రజాపాలన అంటే? అని ప్రశ్నించారు. అలా అయితే, సీఎం రేవంత్‌రెడ్డిపై ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థిని తనపక్కన కూర్చోబెట్టుకోవాలని అన్నారు. అవసరమైతే చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యేలను కాదని కాంగ్రెస్ నాయకులు వచ్చి ఇష్టానుసారంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. స్పీకర్‌ను కలిసినవారిలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్‌కుమార్, చింత ప్రభాకర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాల్సిందే

- సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి 3 నెలల్లో చర్యలు తీసుకోవాలి
- మరో 9 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పార్టీ మారాలని డీఎస్పీలు మా ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి జంపింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్.. తాజాగా మరో 9 మందిపై ఫిర్యాదు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి,సంజయ్‌కుమార్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు. వీరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఇప్పటికే స్పీడ్ పోస్టు, ఈ మెయిల్, వాట్సాప్ ద్వారా స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. అయినా మరోసారి స్వయంగా స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. పార్టీ ఫిరాయించిన వారిపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పిందని స్పీకర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు గుర్తుచేశారు. దానం నాగేందర్‌పై మార్చిలోనే ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్య తీసుకోలేదని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు. స్పీకర్‌గా తన కున్న అధికారాలను ఉపయోగించుకొని వారిపై అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అన్యాయమైన, అక్రమ చేరికల అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం పార్టీ ఫిరాయింపుల అంశంలో 3 నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఉన్నదని.. ఇదే విషయాన్ని స్పీకర్‌కు గుర్తు చేశామని వెల్లడించారు. మణిపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే పార్టీ మారిన సంఘటనలో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఆయనపై అనర్హత వేటు వేశారని, స్పీకర్ కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ పరిధిలోనే ఉన్నారని తెలిపారు. లేదంటే పదవికి అగౌరవంగా ఉంటుందన్న విషయాన్ని తెలియజేశామని చెప్పారు.మణిపూర్ ఎమ్మెల్యే విషయంలో స్పీకర్ 3 నెలల్లో గా నిర్ణయం తీసుకోకపోతే సుప్రీం జోక్యం చేసుకొని వారం లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను కోరిందని గుర్తుచేశామని వివరించారు.

రాజ్యాంగాన్ని కాపాడాలని రాహుల్ ఫోజులు

ఓ పక్క రాజ్యాంగాన్ని కాపాడుతామని ఢిల్లీలో రాహుల్‌గాంధీ ఫోజులు కొడుతున్నారని,రాష్ట్రంలో అదే కాంగ్రెస్‌పార్టీ అదే రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో పార్టీ ఫిరాయింపుపై గగ్గోలుపెట్టే రాహుల్‌గాంధీ.. తెలంగాణలో మాత్రం ఫిరాయింపులను వెన్నుతట్టి మరీ ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటకలో రూ.50 కోట్లకు ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేను బీజేపీ కొనేందుకు ప్రయత్నిస్తున్నదని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆరోపించారని, మరి తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో పరిశీలించాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులు పార్టీ మారబోమని గోవాలో రాహుల్ గాంధీ శపథం చేయించిన సందర్భాన్ని కూడా గుర్తుచేశామని వివరించారు.స్పీకర్ స్వయంగా ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఒక పార్టీపై గెలిచిన అభ్యర్థులు ఇంకో పార్టీలోకి వెళ్లొద్దనే అంశాన్ని స్పష్టం చేశారని, ఆయన గొప్ప ఆలోచన విధానాన్ని అభినందిస్తున్నట్టు తెలిపామని వెల్లడించారు. ఇంటర్వ్యూల్లోనే కాకుండా తాము ఇచ్చిన ఫిర్యాదుపైనా చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టు వెళ్తామని స్పష్టం చేశారు.

మా ఎమ్మెల్యేలకు ప్రాణభయం

రేవంత్‌రెడ్డి పాలనలో దుర్మార్గమైన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని,పార్టీ మారని తమ పార్టీ ఇద్దరు మ్మెల్యేలకు స్థానికంగా ఉండే ఇద్దరు డీఎస్పీలు ఫోన్‌చేసి మీకు ప్రాణభయం ఉన్నదనే విషయాన్ని పరోక్షంగా హెచ్చరించారని కేటీఆర్ అన్నారు. ప్రాణగండం ఉందని పార్టీ మారేలా ఒత్తిడి తెస్తూ బెదిరిస్తున్నారని, మరి కొంతమంది ఎమ్మెల్యేల వ్యాపారాలపై దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి ఆస్తులు, భవనాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాలున్న ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని వెల్లడించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో మాజీమంత్రులు పద్మారావు, సునీతాలక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, కాలేరు వెంకటేశ్,ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి

స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జూలై 16: బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న అసెంబ్లీ పరిధిలో అభివృద్ధి ఆగిపోయిందని, దీనిపై ప్రశ్నిస్తే అధికారులతో కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపితే కమిషనర్ కేసు పెట్టారని గుర్తు చేశారు. మౌలాలిలో కాంగ్రెసోళ్లు దాడికి యత్నించారని స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని, దీనిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ మల్కాజిగిరి డీసీపీని ఆదేశించారని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురైనట్టు సమాచారం. ఆమెను తీహార్ జైలు అధికారులు మంగళవారం ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దవాఖానకు తరలించి ఆరోగ్యపరీక్షలు నిర్వహించినట్టు తెలిసింది. జ్వరంతోపాటు పలు సమస్యలను ఎదుర్కొంటున్నట్టు గుర్తించిన జైలు అధికారులు ఆమెను పరీక్షల నిమిత్తం దవాఖానకు తరలించారు. కవిత అస్వస్థత గురించి జైలు అధికారులు అధికారికంగా ఏమీ వెల్లడించలేదు. అయితే, ఈ విషయమై బుధవారం న్యాయస్థానానికి వివరాలు అందించే అవకాశం ఉన్నది.

సచివాలయంలో ఇంటర్నెట్ బంద్!

బిల్లులు చెల్లించక ఆగిన సరఫరా

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో మంగళవారం రెండు గంటలపాటు ఇంటర్నెట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్న సమయంలోనే ఇలా జరుగడం గమనార్హం. నిపుణ అనే సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటర్నెట్ ప్రొవైడర్‌గా ఉన్నది. సంస్థకు రూ.360 కోట్ల మేర పెండింగ్ బిల్లులు ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, అందుకే రుులక్ ఇచ్చేందుకు కీలకమైన కలెక్టర్లు, ఎస్పీల కాన్ఫరెన్స్‌లో ఇలా రెండు గంటలపాటు సేవలు నిలిపివేసిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇల్లు కట్టాలంటే సగం భూమి ఇవ్వాల్సిందే

- కాంగ్రెస్ నాయకుల బెదిరింపు

ములుగు, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఆ జాగాలో ఇల్లు కట్టుకోవాలంటే సగం భూమి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు ఓ కుటుంబాన్ని బెదిరిస్తున్న ఘటన ములుగు మండలం బండారుపల్లిలో జరిగింది. బాధిత దంపతులు బిళ్ల పోశాలు-స్వరూప మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోశాలు మాట్లాడుతూ, 1993లో అప్పటి ప్రభుత్వం తన తండ్రికి బండారుపల్లి శివారులో రెండు గుంటల భూమిని ఇంటి కోసం ఇచ్చిందని తెలిపాడు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తుండగా మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు లక్ష అడిగారని ఆరోపించాడు. ఇవ్వకపోవడంతో ఈ భూమి ప్రభుత్వానిదని బెదిరిస్తూ గుంట భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోయాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి దాడికి యత్నించారని, తాను రాళ్లు విసరడంతో పారిపోయారని తెలిపాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.మాజీ ఉపసర్పంచ్‌ను వివరణ కోరగా..పోశాలు ప్రభుత్వ భూమిలో ఇల్లు కడుతుండగా.. అది తనదని మరో వ్యక్తి వచ్చాడని చెప్పారు. వారిద్దరూ గొడవపడి ఒకరిపైఒకరు ఫిర్యాదు చేసుకుంటూ తమపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఢిల్లీకి తాకిన ఉద్యమ సెగ

- జంతర్‌మంతర్ వద్ద నిరుద్యోగుల ధర్నా
- ఉద్యోగాల భర్తీ కోసం మిన్నంటిన నిరసన
- 'రేవంత్ హటావో.. తెలంగాణ బచావో' నినాదాలు
- రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి సన్నాహాలు
- డిమాండ్లు నెరవేరేదాకా ఢిల్లీలోనే పోరాటం

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఎగిసిన నిరుద్యోగ ఉద్యమ సెగ ఢిల్లీని తాకింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మంగళవారం జరిగిన ధర్నా హోరెత్తింది. గ్రూప్-1లో 1:100 నిష్పత్తి, మెగా డీఎస్సీ విడుదల, గ్రూప్ 2, 3లో పోస్టుల పెంపుపై కాంగ్రెస్ మాటిచ్చి తప్పిందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే డీఎస్సీ పరీక్షలు రద్దు చేయాలని ప్లకార్డులు పట్టుకొని గొంతెత్తారు. రాష్ట్రంలో నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే తమను నిండా ముంచిందని నిప్పులుచెరిగారు. 'రేవంత్‌రెడ్డి హటావో.. తెలంగాణ బచావో' అని పెద్దపెట్టున నినదించారు. ధర్నాలో నిరుద్యోగులు రమేశ్, బాలరాజు, ప్రకాశ్, అనిత, మోహన్, గోపి, అనిల్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడిస్తాం ..

తమ డిమాండ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం దిగి రాకుంటే రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడిస్తామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యేదాకా ఢిల్లీలోనే ఉండి పోరాటం చేద్దామని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి ఏటా 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరేదాకా ఢిల్లీని వీడేది లేదని, ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు .

ఇవీ డిమాండ్లు

- 18 నుంచి ప్రారంభమయ్యే డీఎస్సీ-2024 పరీక్షలు వెంటనే రద్దు చేయాలి
- గ్రూప్-2లో 2000 పోస్టులు పెంచాలి. ఆగస్టులో నిర్వహించే పరీక్షలు వాయిదా వేయాలి
- గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలి
- గ్రూప్-1 ప్రిలిమినరీ ఫలితాల జీవో 29ను రద్దు చేయాలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులను రిజర్వేషన్ల ప్రకారం మెయిన్స్‌కు ఎంపిక చేయాలి
- గురుకుల పోస్టుల భర్తీలో రిలింక్విష్‌మెంట్ అమలు చేయాలి
- పోలీసు ఉద్యోగాల జీవో 46ను వెంటనే రద్దు చేయాలి

నిన్న ఎలుక.. నేడు పిల్లి

- పెరుగు తాగిన మార్జాలం
- జేఎన్టీయూహెచ్ మెస్‌లో ఘటన
- హాస్టల్ దుస్థితిపై 'ఎక్స్'లో విద్యార్థుల పోస్ట్
- 'ఎలుక కోసం పిల్లి' అంటూ కేటీఆర్ ట్వీట్
- స్పందించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు
- హుటాహుటిన హాస్టల్ తనిఖీ

జేఎన్టీయూహెచ్ వర్సిటీ మంజీరా హాస్టల్‌లో... ఆహారం గిన్నెలపై పిల్లి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 16 : జేఎన్టీయూహెచ్ వర్సిటీలోని మంజీరా హాస్టల్ వంటశాలలో పాత్రలపై ఓ పిల్లి కూర్చొని పెరుగు తాగిన వీడియో సోషల్ మీడియాలో మంగళవారం చక్కర్లు కొట్టింది. ఈ ఘటనను 'ఎక్స్'లో గమనించిన మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి 'వర్సిటీ హాస్టల్స్‌లో ఎలుక కోసం పిల్లి వెదుకుతున్నది' అని ట్వీట్ చేశారు. దీంతో ఇన్నాళ్లూ వర్సిటీ హాస్టల్స్ విద్యార్థుల ఫిర్యాదులను పట్టించుకోని జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు, హాస్టల్ అధికారులు హడావుడి చేశారు. మంగళవారం సాయంత్రం ఫుడ్‌సేఫ్టీ అధికారులు హాస్టల్స్‌లో పర్యటించి ఆహార నాణ్యత, వంటశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు శుచీశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చట్నీలో ఎలుకతో చర్చనీయాంశం

ఇటీవల జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్ బ్రాంచ్ హాస్టల్‌లో చట్నీలో ఎలుక పడింది. అందులోంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా విద్యార్థులు గమనించి వీడియో తీసి వర్సిటీ హాస్టళ్ల దుస్థితిని బయట ప్రపంచానికి చూపించారు. ఈ ఘటనతో వర్సిటీ హాస్టళ్లలోని శుచీశుభ్రత చర్చనీయాంశమైంది. జేఎన్టీయూహెచ్ హాస్టళ్లలో నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నారని, వంటశాలలు పరిశుభ్రంగా లేవని, వంటవారు పరిశుభ్రతను పాటించడం లేదని, ఆహారంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందన లేకపోవడంతో హాస్టల్ బయట బైఠాయించి నిరసన కూడా తెలిపారు. విద్యార్థుల ఆందోళనలు తీవ్రతరం కావడంతో వర్సిటీ రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ అధికారులంతా కలిసి హాస్టళ్లలో పర్యటించి విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటలు చేస్తున్నప్పుడు గ్లౌజ్‌లు ఉపయోగించాలని, పురుగులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని రోజులకే వంటశాలలో పాత్రలపై పిల్లి దర్జాగా కూర్చొని పెరుగు తాగిన ఘటనతో కిందిస్థాయి సిబ్బంది అధికారుల ఆదేశాలను ఏమాత్రం పాటించడం లేదని మరోసారి తేటతెల్లమైంది. తమ సమస్యపై వెంటనే స్పందించిన కేటీఆర్‌కు వర్సిటీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు తిన్న తరువాతనే జరిగింది..

ఈ విషయంపై వర్సిటీ మంజీరా హాస్టల్ వార్డెన్ దుర్గాకుమార్‌ను వివరణ కోరగా విద్యార్థులకు భోజనం అందించిన తర్వాతనే వంటశాలలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల గిన్నెపై పిల్లి కూర్చున్నదని చెప్పారు. పెరుగు మాత్రమే తాగడాన్ని గుర్తించి దాన్ని పారబోశామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

19న చలో టీజీపీఎస్సీ

- గ్రూప్-2, 3 పోస్టుల పెంపు డిమాండ్
- సానుకూల నిర్ణయం రాకుంటే 'సత్యాగ్రహ దీక్ష'

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగుల పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా సోమవారం సచివాలయాన్ని ముట్టడించగా, మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరుద్యోగులు ధర్నా చేశారు. కొనసాగింపుగా ఈ నెల 19న 'చలో టీజీపీఎస్సీ శాంతియుత సత్యాగ్రహ దీక్ష'కు అభ్యర్థులు పిలుపునిచ్చారు. గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3000 పోస్టులు పెంచి, ఆగస్టులో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా వేయాలనే డిమాండ్‌తో దీక్షకు దిగుతున్నట్టు తెలిపారు. టీజీపీఎస్సీ నుంచి తమకు సానుకూలత రాకుంటే దీక్ష తప్పదని హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు తమను అరెస్టు చేసినా ఎక్కడికక్కడే దీక్షలు చేస్తూ ఉండాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీక్షకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

డీఎస్సీపై హైకోర్టుకు

మొదటిపేజీ తరువాయి...

అదేరోజు కేసును విచారించనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పరీక్షలు వాయిదా వేయాలని పోరాటం చేస్తూనే, డీఎస్సీని వాయిదా వేయాలంటూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో మంగళవారం దీక్ష చేశారు.

రేపటి నుంచే పరీక్షలు

డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 18న ప్రారంభమై ఆగస్టు 5 వరకు జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. తొలి సారిగా ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు 26వేల మంది చొప్పున అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తంగా 2,79,956 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 11 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఇప్పటి వరకు 2.2 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

దరఖాస్తుల వివరాలు

పోస్టు	దరఖాస్తులు
స్కూల్ అసిస్టెంట్	1,61,746
సెకండరీ గ్రేడ్ టీచర్	88,007
భాషా పండితులు	18,211
పీఈటీ	11,992
మొత్తం	2,79,956

పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

డీఎస్సీలో 11,062 పోస్టులను భర్తీ చేయనుండగా 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. ఈ పోస్టులకు 1.61 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఎస్జీటీ పోస్టులు 6,508 ఉండగా, 88వేల మంది పోటీపడుతున్నారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ 11 వేలకే పరిమితం చేసింది. సిలబస్ అధికంగా ఉండటం, ప్రిపేరయ్యేందుకు సమయం సరిపోకపోవడంతో డీఎస్సీ వాయిదా వేయాలని కొంతకాలంగా అభ్యర్థులు పోరాడుతున్నారు.

పూరీ జగన్నాథ్.. మళ్లీ అదే పైత్యం

మొదటిపేజీ తరువాయి...

అన్వయించి ప్రదర్శించారు పూరీ జగన్నాథ్. తెలంగాణ వ్యాప్తంగా ఈ సినిమాపై నిరసనలు వెల్లువెత్తడంతో చాలా కేంద్రాల్లో ప్రదర్శన నిలిచిపోయింది. ప్రేక్షకులు నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయింది. ఇప్పుడు తెలంగాణ ఆవిర్భవించి ప్రగతికి చిరునామాగా మారినా పూరీ వైఖరిలో మార్పు రానట్టే కనిపిస్తున్నది. పలు సందర్భంలో తెలంగాణతనాన్ని కించపరిచేలా.. హేళన చేసేలా తన చిత్రాల్లో చూ